# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | శనివారం 26, సెప్టెంబర్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1




## సీఈసీ రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ డిమాండ్.. దేశవ్యాప్తంగా నిరసనలు
- -ఎస్ఐఆర్‌పై ఈసీల అభ్యంతరాల నేపథ్యంలో ఆందోళనలు
- ఎన్నికల సంఘం కార్యాలయం వైపు దూసుకెళ్లిన కాంగ్రెస్ నేతలు
- ఢిల్లీలో కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లు తొలగించేందుకు యత్నించిన ఆందోళనకారులు
- ఇరువర్గాల మధ్య తోపులాట
- జ్ఞానేశ్ కుమార్ మాస్క్‌లతో యూత్ కాంగ్రెస్ నిరసన
- అసోంలో గౌరవ్ గొగోయ్ సహా పలువురి నిర్బంధం

2



## గుండారాజ్యం నుంచి గ్లోబల్ హబ్‌గా యూపీ

- మాఫియాను తుడిచేశాం..
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం: అమిత్ షా
- మాఫియాను పూర్తిగా అణచివేశామని వ్యాఖ్య
- యోగీ పాలనలో శాంతిభద్రతల పునరుద్ధరణ
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని వెల్లడి
- 2017కు ముందు పరిస్థితులను గుర్తుచేసిన అమిత్ షా
- లఖ్‌నవూకు బదులు ఢిల్లీకి తరలిన ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్
- నేడు యూపీలో మారిన పరిస్థితులని వ్యాఖ్య
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో మార్పు వచ్చిందని వెల్లడి
- యూపీ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

2

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రూ.70 లక్షల
విలువైన చెక్కుల పంపిణీ
కళ్యాణ లక్ష్మి..
సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత
అర్హులైన పేదలందరికీ
ఇందిరమ్మ ఇళ్లు
రెండో విడతలో
మరింత మందికి ఇళ్లు
సన్నబియ్యం..
ఉచిత బస్సు ప్రయాణం
దసరాకు ఇందిరమ్మ చీరల పంపిణీ
ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం
అభివృద్ధి.. సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
పెగడపల్లిలో
లబ్ధిదారులకు మంత్రి భరోసా



2

## 13 కోట్ల ఓట్ల తొలగింపు వెనుక బీజేపీ కుట్ర..

ఈసీ తీరుపై ఎంపీ చామల ఫైర్
సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు
జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్
ఎన్నికల కమిషన్ ఎంపికపై అభ్యంతరాలు
సీఈసీ నియామక విధానంపై కాంగ్రెస్ ప్రశ్నలు
సీజేఐని ఎందుకు తప్పించారంటూ నిలదీత
ఎంపిక ప్రక్రియ నుంచే వివాదం మొదలైందా?
ఈసీపై రాజకీయ నియంత్రణ ఆరోపణలు
మోదీ–షాపై ఎంపీ చామల ఆరోపణలు
ఎన్నికల సంఘం స్వతంత్రతపై చర్చ
సీఈసీ నియామక చట్టంపై విపక్షాల అభ్యంతరాలు
ఈసీ వ్యవహారశైలిపై దేశవ్యాప్తంగా చర్చ

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కేంద్ర ఎన్నికల సంఘం (ECI) తీరుపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్‌పై భువనగిరి లోకసభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా మిగతా 2లో..





## మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారా?

భూ అక్రమాలపై ప్రత్యేక కమిటీ
దేవసేన నేతృత్వంలో విచారణ షురూ
కేసీఆర్ భూములపై ఫోకస్?
ఎర్రవల్లిలో ఇప్పటికే సర్వే
ఫామ్‌హౌస్
చుట్టూ భూముల లెక్కలు
కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారా?
భూ రికార్డులు
సమర్పించాలని ఆదేశాలు?
ఓవర్‌ల్యాపింగ్ భూములపై ఆరా
సీలింగ్ యాక్ట్ అమలుపైనా దృష్టి
ధరణి మాడ్యూల్
దుర్వినియోగంపై దర్యాప్తు
అసైన్డ్, భూదాన్ భూములపై విచారణ
మల్లన్నసాగర్.. మిడ్‌మానేరు
భూసేకరణపై ఫోకస్
భూముల సరిహద్దులపై సమగ్ర సర్వే
కలెక్టర్లతో కలిసి
రెవెన్యూ యంత్రాంగం
నిబంధనల మేరకే చర్యలకు కసరత్తు
బాధ్యులను గుర్తించే దిశగా కమిటీ

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో పలు భూ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. వాటిపై విచారణ కోసం తాజాగా ప్రత్యేక కమిటీ వేసింది రాష్ట్ర ప్రభుత్వం. సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ దేవసేన చైర్‌పర్సన్‌గా, రాజీవ్‌గాంధీ హనుమంతు కన్వీనర్‌గా, సందీప్ కుమార్ ఝా సభ్యుడిగా ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్వర్ రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులకు

## ముగిసిన మహా నిమజ్జనం




బడా గణపతి నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి
ఎన్టీఆర్ మార్గ్ క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జన ప్రక్రియ
భారీ క్రేన్ల సాయంతో
గణనాథుడిని సాగనంపిన అధికారులు
మధ్యాహ్నం 2.15 గంటలకు
పూర్తయిన నిమజ్జన కార్యక్రమం
లక్షలాది భక్తుల నడుమ
సాగిన గణేశ్ నిమజ్జనోత్సవం
ఖైరతాబాద్ నుంచి హుస్సేన్‌సాగర్
వరకు భక్తజన సందోహం
వినాయక నామస్మరణతో మార్మోగిన హైదరాబాద్
నిమజ్జనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల విస్తృత ఏర్పాట్లు
హైదరాబాద్ పోలీసుల డ్రోన్ వీడియో వైరల్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగే ఖైరతాబాద్ బడా గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్ద భారీ క్రేన్ల సాయంతో గణనాథుడిని హుస్సేన్‌సాగర్‌లో మిగతా 2లో..

## ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..

- అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ
- గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ
- సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్
- అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ దేశంలో పుట్టిన పౌరులకు, గతంలో మిగతా 2లో..



## ఎన్నికల్లో పోటీ చేయొద్దు

- విపక్షాలకు సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే సూచన
- ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపణ
- అవకతవకలపై విపక్షాల వైఖరిని ప్రశ్నించిన దీప్కే
- ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజల్లో తప్పుడు సంకేతం అన్న అభిప్రాయం
- రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- 24 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్
- లేకపోతే జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు పిలుపు
- అక్టోబర్ 2 నుంచి 'జంతర్ మంతర్ 2.0'



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని భావిస్తే ప్రతిపక్షాలు ఇకపై ఎన్నికల్లో పోటీ చేయొద్దని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చీఫ్ అభిజిత్ దీప్కే సూచించారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపిస్తున్న విపక్షాలు.. అదే ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నాయని ప్రశ్నించారు.
ఎన్నికల ప్రక్రియపై నమ్మకం లేదని చెబుతూ.. అదే వ్యవస్థలో కొనసాగడం సరైన విధానం కాదని మిగతా 2లో..

## బాలాపూర్ లడ్డూ రూ.39 లక్షలు

రికార్డు ధర పలికిన గణేశుడి లడ్డూ
వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు
చెందిన ప్రణీత్‌రెడ్డి సొంతంవేలంలో 8 మంది పేర్ల నమోదు
రూ.35 లక్షల నుంచి పెరిగిన ధర
గతేడాది రూ.35 లక్షలు పలికిన లడ్డూ
21 కిలోల లడ్డూకు భారీ డిమాండ్
బాలాపూర్ లడ్డూకు ప్రత్యేక గుర్తింపు
లడ్డూ దక్కితే శుభం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల నమ్మకం
ఏటా వేలంలో పెరుగుతున్న లడ్డూ ధర
వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కు ప్రత్యేక స్థానం

3





## తీవ్ర వాయుగుండం బలహీనం

### మరో రెండు రోజులు వర్షాలు

వాయుగుండంగా మారిన తీవ్ర వాయుగుండం
రానున్న 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం
విశాఖ సమీపంలో తీరం దాటిన తీవ్ర వాయుగుండం
ఐదు రోజులుగా కురిసిన వర్షా లకు తగ్గుముఖం
వాయవ్య దిశగా పయనిస్తున్న వాయుగుండం
దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు కదలిక
కోస్తాంధ్రలో మరో రెండు రోజుల పాటు వర్షా లు
ఉరుములు, మెరుపులతో వర్షా లు కురిసే అవకాశం
ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన
వాతావరణ పరిస్థితులపై కొనసాగుతున్న పర్యవేక్షణ

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం క్రమంగా బలహీనపడుతోంది. విశాఖ సమీపంలో తీరం దాటిన అనంతరం వాయవ్య దిశగా పయనిస్తున్న ఈ వ్యవస్థ.. ప్రస్తుతం వాయుగుండంగా మారింది. రానున్న 12 గంటల్లో మరింత బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

**ఐదు రోజులుగా వర్షా లు**
తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. విశాఖ సమీపంలో తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో ప్రస్తుతం వర్షాల మిగతా 2లో..

# సీఈసీ రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ డిమాండ్.. దేశవ్యాప్తంగా నిరసనలు
- -ఎస్ఐఆర్‌పై ఈసీల అభ్యంతరాల నేపథ్యంలో ఆందోళనలు
- ఎన్నికల సంఘం కార్యాలయం వైపు దూసుకెళ్లిన కాంగ్రెస్ నేతలు
- ఢిల్లీలో కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లు తొలగించేందుకు యత్నించిన ఆందోళనకారులు
- ఇరువర్గాల మధ్య తోపులాట
- జ్ఞానేశ్ కుమార్ మాస్క్‌లతో యూత్ కాంగ్రెస్ నిరసన
- అసోంలో గౌరవ్ గొగోయ్ సహా పలువురి నిర్బంధం
- చండీగఢ్‌లో జలఫిరంగులతో నిరసనకారుల అదుపు
- పట్నా, కోల్‌కతా, జమ్మూలోనూ ఆందోళనలు
- ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడతామన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):


ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ఎన్నికల సంఘంలో ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలకు దిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పలు రాష్ట్రాల్లో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.
ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. బారికేడ్లను తొలగిస్తూ ముందుకు సాగేందుకు కొందరు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
అంతకుముందు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రూపాన్ని పోలిన మాస్క్‌లు ధరించి నిరసన చేపట్టారు. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ నిర్వహించేందుకు వారు ప్రయత్నించారు. అస్సాంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చండీగఢ్‌లో నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు జలఫిరంగులను ప్రయోగించారు. పట్నా సహా పలు ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు నిర్వహించాయి. కోల్‌కతా, జమ్మూ తదితర ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగినట్లు నివేదికలు వెల్లడించాయి.
ఈ నిరసనలకు కారణమైన ఎస్ఐఆర్ అంశంపై ఇటీవల ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై చర్చకు దారితీసింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాలపై అధికారికంగా అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది.
కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటరు జాబితా డేటాబేస్ నిర్వహణ, ఎస్ఐఆర్ ప్రక్రియలోని కొన్ని నిర్ణయాలపై ఈ అభ్యంతరాలు ఉన్నట్లు నివేదిక తెలిపింది. కొన్ని చర్యలను వారు అనధికారికమైనవిగా, చట్టవిరుద్ధమైనవిగా పేర్కొన్నట్లు వెల్లడించింది.
గోవాలో ఓటర్ల వివరాల సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సమస్యపైనా ఇద్దరు కమిషనర్లు ప్రశ్నలు లేవనెత్తినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఎన్నికల జాబితా నిర్వహణలో క్షేత్రస్థాయి అధికారుల అధికారాలు, కేంద్రస్థాయిలో డిజిటల్ వ్యవస్థ నియంత్రణపై కూడా వారు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది.
అయితే ఎన్నికల సంఘంలో నిర్ణయాలు ఎలా తీసుకున్నారన్న దానిపై వచ్చిన రాజకీయ ఆరోపణలకు సంబంధించి వివిధ వాదనలు ఉన్నాయి. ఈసీలో భిన్నాభిప్రాయాలు ఉండటం రాజ్యాంగబద్ధ సంస్థల్లో చర్చలో భాగమేనని, నిర్ణయాలు చట్టప్రకారమే జరుగుతున్నాయని ఎన్నికల సంఘం వైపు నుంచి వివరణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై రాజకీయంగా ఒత్తిడి పెంచే కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు.

# గుండారాజ్యం నుంచి గ్లోబల్ హబ్‌గా యూపీ

- మాఫియాను తుడిచేశాం..
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం: అమిత్ షా
- మాఫియాను పూర్తిగా అణచివేశామని వ్యాఖ్య
- యోగీ పాలనలో శాంతిభద్రతల పునరుద్ధరణ
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని వెల్లడి
- 2017కు ముందు పరిస్థితులను గుర్తుచేసిన అమిత్ షా
- లఖ్‌నవూకు బదులు ఢిల్లీకి తరలిన ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్
- నేడు యూపీలో మారిన పరిస్థితులని వ్యాఖ్య
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో మార్పు వచ్చిందని వెల్లడి
- యూపీ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- మోదీ విధానాలతో భారత్ తయారీ కేంద్రంగా ఎదుగుతోందని వ్యాఖ్య
- 'ఒకే జిల్లా.. ఒకే ఉత్పత్తి' వెబ్‌సైట్ ప్రారంభం

నోయిడా, (ప్రజాస్వరం):

నోయిడాలో నిర్వహించిన 'యూపీ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో 2026' ప్రారంభోత్సవంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో గతంలో రాజ్యమేలిన మాఫియాను యోగీ ప్రభుత్వం పూర్తిగా తుడిచిపెట్టిందని అన్నారు. శాంతి భద్రతలను పునరుద్ధరించడం ద్వారా పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు.
2017కు ముందు ఉత్తర్‌ప్రదేశ్‌లో మాఫియా పాలన సాగేదని అమిత్ షా పేర్కొన్నారు. యోగీ ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రౌడీయిజం, మాఫియా మూలాలను తొలగించడంతో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని తెలిపారు. ఇదే కారణంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు మార్గం సుగమమైందని చెప్పారు.
2013లో అప్పటి సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వం పరిశ్రమలను ఆకర్షించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ నిర్వహించాలని ప్రయత్నించిందని అమిత్ షా తెలిపారు. అయితే లఖ్‌నవూలో శాంతిభద్రతల పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆ కార్యక్రమాన్ని ఢిల్లీకి తరలించాల్సి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా మారిందని పేర్కొన్నారు.
కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో యోగీ ఆదిత్యనాథ్ నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే ఈ మార్పు సాధ్యమైందని అమిత్ షా అన్నారు. శాంతి, భద్రత, స్థిరత్వం కారణంగా ఉత్తర్‌ప్రదేశ్ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని తెలిపారు. మోదీ వరుసగా మూడుసార్లు ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని రాజకీయ స్థిరత్వాన్ని అందించారని అమిత్ షా పేర్కొన్నారు. దీంతో విధాన నిర్ణయాలను వేగంగా అమలు చేయగలుగుతున్నామని చెప్పారు. కొత్త విధానాలతో భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మోదీ తీర్చిదిద్దుతున్నారని వ్యాఖ్యానించారు.
కార్యక్రమంలో భాగంగా 'ఒకే జిల్లా.. ఒకే ఉత్పత్తి' (ODOP) నూతన వెబ్‌సైట్‌ను అమిత్ షా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా యూపీ యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత ప్రాంతాల్లోనే ఉద్యోగాలు పొందుతున్నారని ఆయన తెలిపారు. అంతర్జాతీయ ట్రేడ్ షోతో స్థానిక తయారీదారులకు ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందని అన్నారు.



# ముగిసిన మహా నిమజ్జనం

మొదటిపేజీ తరువాయి

నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జన ప్రక్రియ పూర్తయింది.

**ప్రత్యేక ఆకర్షణగా బడా గణపతి**
ప్రతి ఏడాది ఖైరతాబాద్ బడా గణపతి నిమజ్జనం హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. భారీ విగ్రహాన్ని దర్శించుకునేందుకు నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. నిమజ్జనానికి ముందు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం భారీ ఊరేగింపుగా గణనాథుడిని నిమజ్జన వేదిక వద్దకు తీసుకొచ్చారు.

**భారీ క్రేన్లతో నిమజ్జనం**
భారీ పరిమాణంలో ఉన్న ఖైరతాబాద్ గణపతిని నిమజ్జనం చేసేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద భారీ క్రేన్లను వినియోగించారు. నిర్ణీత ప్రక్రియ ప్రకారం విగ్రహాన్ని క్రేన్ల సాయంతో హుస్సేన్‌సాగర్‌లోకి తరలించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జన ప్రక్రియ పూర్తయింది.

**భక్తజన సందోహం**
ఖైరతాబాద్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు గణనాథుడి శోభాయాత్రను చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భక్తులు గణనాథుడికి చివరి వీడ్కోలు పలికారు. నిమజ్జన ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు పలువురు భక్తులు రహదారుల వెంట వేచి ఉన్నారు.

**హైదరాబాద్ అంతా సందడే..**
నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు హుస్సేన్‌సాగర్ వైపు తరలివచ్చాయి. దీంతో ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, ఖైరతాబాద్, లక్డీకాపూల్ తదితర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. డీజేలు, బ్యాండ్లు, భక్తి గీతాలతో నిమజ్జన శోభాయాత్రలు సాగాయి.

**పోలీసుల భారీ బందోబస్తు**
గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా హైదరాబాద్ పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు నిమజ్జన మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పలు చర్యలు చేపట్టారు.

**డ్రోన్ వీడియో వైరల్**
ఖైరతాబాద్ బడా గణపతి నిమజ్జన ఘట్టాన్ని హైదరాబాద్ పోలీసులు డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. పై నుంచి తీసిన ఆ దృశ్యాల్లో నిమజ్జన ప్రాంతం, భారీగా తరలివచ్చిన భక్తులు, రహదారులపై కనిపించిన గణేశ్ శోభాయాత్రలు ఆకట్టుకునేలా ఉన్నాయి. హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో పంచుకున్న ఈ డ్రోన్ వీడియో ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

**ఒక్కచోట బడా గణపతి..**
**మరోవైపు వేలాది విగ్రహాలు**
ఖైరతాబాద్ బడా గణపతి నిమజ్జనంతో పాటు హైదరాబాద్ నగరవ్యాప్తంగా వేలాది వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు.

**భక్తుల వీడ్కోలు**
వినాయక చవితి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా



నిలిచిన ఖైరతాబాద్ బడా గణపతికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా పూర్తికావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల్లో మరో వైభవోపేత అధ్యాయం ముగిసింది.

# ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..

మొదటిపేజీ తరువాయి

పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు.
నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల



ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.

# తీవ్ర వాయుగుండం బలహీనం

మొదటిపేజీ తరువాయి

తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టింది.

**ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు**
తీరం దాటిన తర్వాత తీవ్ర వాయుగుండం దిశ మార్చుకుని వాయవ్య దిశగా కదులుతోంది. దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చేరుకునే సమయానికి ఇది వాయుగుండంగా మారినట్లు వాతావరణశాఖ తెలిపింది. రానున్న 12 గంటల్లో మరింత బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని పేర్కొంది.

**మరో రెండు రోజులు వర్షా లు**
తీవ్ర వాయుగుండం బలహీనపడుతున్నప్పటికీ కోస్తాంధ్ర ప్రాంతాలకు వర్షాల ముప్పు పూర్తిగా తొలగిపోలేదు. మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది.

**అప్రమత్తంగా ఉండాలని సూచన**
వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ సూచించింది. స్థానిక పరిస్థితులను గమనిస్తూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రూ.70 లక్షల విలువైన చెక్కుల పంపిణీ
- కళ్యాణ లక్ష్మి.. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత
- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- రెండో విడతలో మరింత మందికి ఇళ్లు
- సన్నబియ్యం.. ఉచిత బస్సు ప్రయాణం
- దసరాకు ఇందిరమ్మ చీరల పంపిణీ
- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం
- అభివృద్ధి.. సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- పెగడపల్లిలో లబ్ధిదారులకు మంత్రి భరోసా

హైదరాబాద్, (ప్రజాస్వరం):

ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. రూ.39 లక్షల విలువైన కళ్యాణ లక్ష్మి, రూ.31 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు కాగా, అధికారులతో కలిసి వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం అందించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రెండో విడతలో మరింత మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. దసరా నాటికి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

**చెరువుల అభివృద్ధితో సాగునీరు**
పెగడపల్లి మండలంలో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గొల్లపల్లి మండలంలోని రంగధాముని పల్లి, దికొండ చెరువులను అభివృద్ధి చేసి పెగడపల్లి మండలంలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. మండలంలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మండలంలోని అన్ని తండాలకు రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సయ్యద్ నిజాముద్దీన్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి, సర్పంచులు ఓరుగలి అరుణ శ్రీనివాస్, అయితరవేణి లక్ష్మణ్, మోకినపల్లి గోపాల్, రమేష్‌నాయక్, కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చెట్ల కిషన్, చాట్ల విజయ్ భాస్కర్, లింగంపల్లి మహేష్, బాలుసాని శ్రీనివాస్, మన్నె గంగరాజం, నాయకులు సంధి మల్లారెడ్డి, పూసల తిరుపతి, బండారి శ్రీనివాస్, రాం రెడ్డి, సుంకరి రవి, తడగొండ రాజు, దికొండ మహేందర్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారా?

మొదటిపేజీ తరువాయి



సంబంధించిన భూములపై ఈ కమిటీ విచారణ జరపనుంది. ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్ భూములతో పాటు ధరణి మాడ్యూల్ దుర్వినియోగం, మల్లన్న సాగర్, మిడ్ మానేరు ప్రాజెక్టుల భూసేకరణలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేయాలని కమిటీకి నిర్దేశించింది ప్రభుత్వం. నిర్దేశించిన జిల్లాల్లో జరిగిన ఈ భూ అక్రమాలకు బాధ్యులను గుర్తించి, చర్యలు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి కమిటీ నివేదికను సమర్పించాల్సి ఉంది. ఐతే కమిటీ.. తన పనిని ఎక్కడి నుంచి మొదలు పెట్టబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. ఇదే క్రమంలో అందరి ఫోకస్.. మాజీ సీఎం కేసీఆర్ వైపు మళ్ళింది. ఆయనకు నోటీసులు ఇస్తారా..? లేదా అన్న డిస్కషన్స్ నడుస్తున్నాయి. ఎర్రవల్లిలో ఇప్పటికే రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న భూముల సర్వే పూర్తయ్యాక.. డైరెక్ట్‌గా ఫామ్‌హౌస్ ఎపిసోడ్‌కి వెళ్ళవచ్చన్న అంచనాలున్నాయి. దానికి సంబంధించి త్వరలోనే కేసీఆర్‌కి కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పుకుంటున్నారు.
భూములకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని మొదట కోరవచ్చని అంటున్నారు. కేసీఆర్‌తో పాటు చుట్టు పక్కల ఉన్న భూముల యజమానులకు నోటీసులు ఇవ్వడం, వారి రికార్డులు అడగడంతో పాటు.. వాటి ప్రకారం సర్వే నిర్వహించే అవకాశం ఉందని అంటున్నారు. రికార్డుల ప్రకారం భూముల సరిహద్దులు గుర్తించడం, ఓవర్ ల్యాపింగ్ భూమి లెక్క తేల్చే ఛాన్సే ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. అలాగే.. సీలింగ్ యాక్ట్ అమలు మీద కూడా ఫోకస్ చేసే అవకాశం ఉందని అంటున్నారు. నోటీసులు ఇచ్చి.. వివరాలు సేకరించి.. భూముల లెక్క తేల్చి చర్యలు తీసుకోవాలన్న ఆలోచనతోనే ప్రభుత్వం కమిటీ వేసిందన్న ప్రచారం జరుగుతోంది. కమిటీ పని కూడా అదే యాంగిల్‌లో ఉండవచ్చన్నది ఓ అంచనా. సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రస్తావించిన పేర్లతో పాటు.. రెవెన్యూ మంత్రి పొంగులేటి విప్పిన ధరణి చిట్టా ప్రకారం.. చర్యలు తీసుకునే పనిలో అధికార యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తోంది. కమిటీకి తోడుగా.. ఎంపిక చేసిన భూములు ఉన్న జిల్లాల కలెక్టర్లు కూడా సభ్యులుగా ఉంటారు. ఇలా రెవెన్యూ యంత్రాంగం అంతా.. ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చడం.. ధరణి మాడ్యుల్‌లో లోపాలు గుర్తించడం.. బాధ్యులకు నోటీసులు ఇచ్చుకుంటూ చర్యలకు దిగడం లాంటి పనుల్ని ఒక పద్ధతి ప్రకారం చేస్తుందని చెబుతున్నారు. లీగల్‌గా ఎక్కడా లోపాలు లేకుండా.. నిబంధనల మేరకు వ్యవహారం చక్కబెట్టలాలన్నది ప్రభుత్వ ఆలోచనగా చెబుతున్నారు. కమిటీ వేయడమంటే.. పని మొదలుపెట్టడమేనన్న ఇండికేషన్ ఇస్తోంది సర్కార్.

# ఎన్నికల్లో పోటీ చేయొద్దు

మొదటిపేజీ తరువాయి

దీప్కే వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు పోటీ చేయడం వల్ల ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే భావన ప్రజల్లో కలుగుతోందని అన్నారు.
ఓట్లు దొంగిలిస్తున్నారని, నేతలను ప్రలోభపెడుతున్నారని, రాజకీయ పార్టీలను చీల్చుతున్నారని ఆరోపిస్తున్నప్పుడు.. తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ఇంకా ఎందుకు ప్రయత్నిస్తున్నారని దీప్కే ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియ మోసపూరితంగా ఉందని భావిస్తే.. అలాంటి ఎన్నికల్లో పాల్గొనడం ఆపాలని సూచించారు.
రాజకీయ మనుగడ కంటే దేశ ప్రజాస్వామ్య ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు పిలుపునిచ్చారు. ఎన్నికలపై తమకు ఉన్న అభ్యంతరాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఎన్నికల ప్రక్రియపై నమ్మకం లేదని చెబుతున్న పార్టీలు తమ వైఖరిపై పునరాలోచించాలని సూచించారు.
ఎస్ఐఆర్ అంశంపై ఎన్నికల సంఘంలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యం



లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని దీప్కే డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ 24 గంటల్లో పదవి నుంచి తప్పుకోవాలని కోరారు.
తన డిమాండ్‌పై స్పందన లేకపోతే అక్టోబర్ 2 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'జంతర్ మంతర్ 2.0' పేరుతో మరోసారి నిరసన కార్యక్రమం చేపడతామని దీప్కే ప్రకటించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై విపక్షాలు విమర్శలు చేస్తున్న సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 13 కోట్ల ఓట్ల తొలగింపు వెనుక బీజేపీ కుట్ర..

మొదటిపేజీ తరువాయి

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోందని, బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయనను కుట్రపూరితంగా ఆ పదవీలో కూర్చోబెట్టిందని ఆరోపించారు. గతంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (CJI) సభ్యుడిగా ఉన్న కమిటీ ఎంపిక చేసే సాంప్రదాయం ఉండేదని ఎంపీ చామల గుర్తు చేశారు. అయితే, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇద్దరూ కావాలనే సీజేఐని ఆ ఎంపిక ప్రక్రియ నుంచి తప్పించి, తమకు అనుకూలమైన వ్యక్తిని సీఈసీగా నియమించుకున్నారని విమర్శించారు. సెలెక్షన్ ప్రాసెస్ నుంచే ఎన్నికల కమిషనన్ను బీజేపీ తమ ఆధీనంలో పెట్టుకుందని మండిపడ్డారు.

13 కోట్ల ఓట్ల తొలగింపు..
రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును తొలగించే కుట్ర సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతోందని ఎంపీ ఆరోపించారు. ఫామ్ 6 ద్వారా దేశవ్యాప్తంగా ఏకంగా 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారని, తొలగించిన వారికి మళ్లీ ఓటు హక్కు పొందే అవకాశం కూడా ఇవ్వడంలేదని తెలిపారు. హర్యానా ఎన్నికల వివాదంలో రాహుల్ గాంధీ సీసీటీవీ ఫుటేజ్ అడిగినా ఇవ్వలేదని, నిబంధనల ప్రకారం 45 రోజుల పాటు ఉంచాల్సిన ఫుటేజ్‌ను ఎందుకు దాచారని ప్రశ్నించారు. అలాగే కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో లక్షకు పైగా బల్క్ ఓట్లను నమోదు చేసి, ఫొటోగ్రాఫ్‌లను మార్చేశారని ఆధారాలతో సహా విమర్శించారు.

సుప్రీంకోర్టు vజోక్యం చేసుకోవాలి..
దేశంలో ఎప్పటికీ తమదే అధికారంగా ఉండాలని గుజరాత్ మోడల్ తరహాలో మోడీ అమిత్ షా భ్రమపడుతున్నారని, దీనికోసం సెక్యులర్ దేశాన్ని భ్రష్టు పట్టించారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఓట్ల తొలగింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ఇటీవల జరిగిన ఎన్నికలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలంటే పార్లమెంట్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని, సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని రాజ్యాంగాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బృందావన్ కాలనీ గణేష్ లడ్డూ వేలంపాట

- **లక్ష 77 వేల రూపాయలకు దక్కించుకున్న మేకల అయ్యప్ప**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 25, (ప్రజాస్వరం):**

జవహర్‌నగర్ లోని బృందావన్ కాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో శుక్రవారం గణేష్ నిమర్జనం సందర్భంగా ఏర్పాటుచేసిన లడ్డు వేలంపాటలో బిజె కన్స్ట్రక్షన్స్ అధినేత మేకల అయ్యప్ప లక్ష 77 వేల రూపాయలకు గణేష్ లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. స్వామి వారి కృపతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య. అయ్యప్ప కుటుంబ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# బాలాపూర్ లడ్డూ రూ.39 లక్షలు

- **సామ ప్రణీత్‌రెడ్డికి సొంతం**
- **రికార్డు ధర పలికిన గణేశుడి లడ్డూ**
- **వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన ప్రణీత్‌రెడ్డి సొంతం**
- **వేలంలో 8 మంది పేర్ల నమోదు**
- **రూ.35 లక్షల నుంచి పెరిగిన ధర**
- **గతేడాది రూ.35 లక్షలు పలికిన లడ్డూ**
- **21 కిలోల లడ్డూకు భారీ డిమాండ్**
- **బాలాపూర్ లడ్డూకు ప్రత్యేక గుర్తింపు**
- **లడ్డూ దక్కితే శుభం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల నమ్మకం**
- **ఏటా వేలంలో పెరుగుతున్న లడ్డూ ధర**
- **వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కు ప్రత్యేక స్థానం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



నగరంలోని బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పూర్తయింది. ఈసారి లడ్డూ రికార్డు ధర పలికింది. వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్‌రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. చివరికి ప్రణీత్‌రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు.

గతేడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ రూ.35 లక్షలు పలికింది. ఈసారి గతేడాది ధరను అధిగమించి రూ.39 లక్షలకు చేరింది. దీంతో బాలాపూర్ లడ్డూ వేలం మరోసారి వార్తల్లో నిలిచింది.వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. నవరాత్రులు పూజలందుకునే గణేశుడి చేతిలోని 21 కిలోల లడ్డూ ప్రసాదానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ లడ్డూను దక్కించుకుంటే శుభం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు.

ఈ నమ్మకంతో ప్రతి ఏటా లడ్డూ వేలంలో పాల్గొనేందుకు పలువురు పోటీ పడుతుంటారు. వేలంలో లడ్డూను దక్కించుకున్న వారు దానిని ప్రసాదంగా పంచుతుంటారు. బాలాపూర్ లడ్డూ వేలం ఏటా ఆసక్తికరంగా మారుతుండటంతో దీనిపై నగరవాసుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంటుంది.




## తూప్రాన్ ఐడి పోలీస్ లకు రివార్డ్స్... ఎస్పీ శ్రీనివాస్ రావు

**తూప్రాన్ సెప్టెంబర్ 25 (ప్రజా స్వరం )**

మేదక్ జిల్లా తూప్రాన్ లో కలకాలం రేపిన ఎర్ర జండ హెచ్చరిక లేఖ విషయం లో తూప్రాన్ పోలీస్ లు వెంకట్ కృష్ణ తదితరులు సీసీ ఫూటేజ్. సాంకేతిక పరిజ్ఞానం తో రెండు రోజులలో లేఖ విడుదల చేసిన మండలం లోని నాగులపల్లి కి చెందిన యువకులు మధు. శ్రీధర్ లను పట్టుకోవడంలో స్పీడ్ గా ట్రెస్ చేయడం అభినందనీయం సిబ్బంది కి జిల్లా ఎస్పీ రివార్డ్స్ అందజేసి అభినందించారు.. ఈ కార్యక్రమం లో తూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్ తూప్రాన్ ఎస్సై గంగరాజు ఉన్నారు





## చారిత్రక వైభవం చందంపేట గడికోట
# పర్యాటక ఉత్సవాలకు ముస్తాబు..

- **కోట మరమ్మతు పనులను పరిశీలించిన తహసీల్దార్ మాలతి..**
- **పురాతన కట్టడాలను కాపాడుకుందాం: సర్పంచ్ ప్రవీణ్ కుమార్..**

**చిన్నశంకరంపేట ( ప్రజా స్వరం ) సెప్టెంబర్ 25**





తెలంగాణ ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు రూపంగా నిలిచిన చందంపేట గడికోట త్వరలో పర్యాటక ఉత్సవాలకు వేదిక కానుంది. చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలోని ఈ చారిత్రాత్మక గడికోటను తహసీల్దార్ మాలతి, గ్రామ సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోట పునరుద్ధరణలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనులను పర్యవేక్షించి, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాలతి, సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ పాపన్నపేట సంస్థాన రాణి చందమ్మ పరిపాలనా కాలంలో ఈ అద్భుతమైన గడికోట నిర్మితమైందని గుర్తు చేశారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ కోట ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆమె ప్రకటించారు. మన పూర్వీకులు మనకందించిన అరుదైన చారిత్రక సంపదను, పురాతన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గడికోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తుల సహకారంతో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానిక యువకులు, అధికారులు పాల్గొన్నారు.

## పోతంగల్ లో ఘనంగా
# గణేషుని శోభాయాత్ర

**పోతంగల్, సెప్టెంబర్25( ప్రజాస్వరం):**

పోతంగల్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ(హడ్కో కాలనీ)లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.11 రోజులు గ్రామ ప్రజల ద్వారా విశేష పూజలు అందుకున్న గణనాథుడిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభయాత్ర ఘనంగా నిర్వహించి గంగమ్మ ఒడికి చేర్చారు. ముఖ్య అతిథులను సార్వజనిక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాషాయం కండువాలతో తో ఘనంగా సన్మానించారు. శోభాయాత్రలో భక్తి పాటలు కోలాటాలతో యువకులు,చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గణేషుని శోభాయాత్ర సందర్భంగా పొతంగల్ మండల వ్యాప్తంగా కాషాయ జెండాలు, భక్తి పాటలతో భక్తి భావం పెంపొందింది.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పోతంగల్ మండల అధ్యక్షుడు బజరంగ్,మాజీ ఎంపిటిసి కేశ వీరేశం, బజరంగభలి యూత్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు,పోలీసు, విద్యుత్ శాఖల సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## పాము కాటుకు గురైన రైతుకు కౌన్సిలర్ పరామర్శ.. ఆర్థిక సాయం

**ప్రజాస్వరం,మేడ్చల్**

ఎల్లంపేట్ మున్సిపాలిటీలోని 24వ వార్డుకు చెందిన బక్క రామ్మూర్తి వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యారు. విషయం తెలుసుకున్న 24 వార్డు కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్ అనంతరం ఆసుపత్రికి వెళ్లి రామ్మూర్తిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అనంతరం రామ్మూర్తి చికిత్సకు తోడ్పాటుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.





## గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

- **చిన్న కంజర్ల కౌన్సిలర్ మల్లేపల్లి శ్రీనివాస్**

**పఠాన్ చెరు, సెప్టెంబర్ 25 ప్రజా స్వరం**

పఠాన్ చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్, చిన్న కంజర్ల గ్రామంలో కొలువుదీరిన గణనాథుడికి ఇంద్రేశం మున్సిపాలిటీ, చిన్న కంజర్ల 1వ వార్డు కౌన్సిలర్ మల్లెపల్లి శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులు, లావణ్య, అనన్య శ్రీ, అక్షిత్ సాయి, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాధుడు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని విఘ్నేశ్వరుని వేడుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు విఘ్నేశ్వరుని ఆశీస్సులతో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు అందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం విగ్నేశ్వరుని లడ్డు వేలం పాటలో గణనాథులు లడ్డు కూడా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్, కమిటీ సభ్యులు, భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల కన్నీటికి అండగా లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్

- **బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం**

**చిన్నశంకరంపేట ( ప్రజా స్వరం ) సెప్టెంబర్ 25**

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయాన్ని అందిస్తూ లీల గ్రూప్ చైర్మన్, డాక్టర్ మోహన్ నాయక్ అండగా నిలిచారు. చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల ప్రమాదాలు, అనారోగ్యంతో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందించారు. చిన్న శంకరంపేట మండల కేంద్రానికి చెందిన ఓ దీనపత్రిక విలేకరి కమ్మరి దేవరాజు సుమారు మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దేవరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దూదేకుల షబ్బీర్ కుటుంబాన్ని కూడా పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారికి ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం కామారం తండాలో పర్యటించిన డాక్టర్ మోహన్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మూడవత్ కుమార్, గుండెపోటుతో మృతి చెందిన హలావత్ యాదగిరి, హలావత్ మహేందర్ కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. చిన్నారులను, కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. బాధిత కుటుంబాలకు తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు. మొత్తం ఐదు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో వారికి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించడమే కాకుండా, వారి వెంట తాము ఉన్నామనే భరోసాను కల్పించారు.

**ప్రత్యేక అభినందనలు**

కామారం తండా సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ హలావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శించి, వారికి తన వంతు ఆర్థిక సహాయం అందించిన లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పేద కుటుంబాల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. బాధిత కుటుంబాలకు ఇలాంటి సహకారం ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు నవీన్ కుమార్, ప్రభాకర్, అరుణ్ యాదవ్, సందీప్, లక్ష్మణ్, నరేష్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## అర్జున్‌ను సచిన్‌తో పోల్చడం అన్యాయం.. అతను తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకుంటాడు

- **దిగ్గజ క్రికెటర్ల కుమారులను వారి తండ్రులతో పోల్చడం సరికాదన్న వీరూ**
- **అర్జున్ టెండూల్కర్‌ను సచిన్‌తో పోల్చడంపై తీవ్ర అసహనం**
- **అర్జున్ ఒక ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడని ప్రశంస**
- **యువ ఆటగాళ్లపై పోలికలతో ఒత్తిడి పెంచవద్దని సూచన**
- **తన కుమారుడు ఆర్యవీర్ విషయంలోనూ ఇదే వర్తిస్తుందని వ్యాఖ్య**

**ప్రజాస్వరం :**

దిగ్గజ క్రికెటర్ల కుమారులను వారి తండ్రులతో పోల్చి చూడటం సరైన పద్ధతి కాదని, ఇది యువ ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతుందని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్‌ను నిరంతరం సచిన్‌తో పోల్చడంపై అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి పోలికలు సహజంగానే వచ్చినా, అవి యువకుల కెరీర్‌కు ఏమాత్రం మంచివి కావని స్పష్టం చేశాడు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సెహ్వాగ్ ఈ అంశంపై మాట్లాడాడు. "తండ్రులు ఉన్నత స్థాయిలో రాణించినందువల్ల, వారి పిల్లలను వారితో పోల్చడం మొదలుపెడతారు. కానీ అది సరైన పని కాదు. వారిని ఇతర ఆటగాళ్లతో పోల్చండి, అంతేకానీ తండ్రులతో ఎందుకు పోలుస్తున్నారు? మీడియా, ప్రజల నుంచి వచ్చే ఈ నిరంతర పోలికల వల్ల యువ ఆటగాళ్లు మానసికంగా ఎంతో కుంగిపోతారు" అని సెహ్వాగ్ అన్నాడు.

అర్జున్ టెండూల్కర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "ప్రజలు సచిన్ కుమారుడిని సచిన్‌తో పోలుస్తున్నారు. అది చాలా అన్యాయం. అర్జున్ ఒక ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్. రంజీ ట్రోఫీలో సెంచరీ సాధించి, ఐదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు. అయినా ఎందుకో ప్రజలు అతడిని సచిన్‌తో పోలుస్తున్నారు. అర్జున్ తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకుంటాడు. తనకు నచ్చిన విధంగా ఆడతాడు. అతను తన తండ్రి అడుగుజాడల్లోనే నడవాల్సిన అవసరం లేదు" అని సెహ్వాగ్ వ్యాఖ్య స్పష్టం చేశాడు.

ఇదే విషయాన్ని తన కుమారుడు ఆర్యవీర్ విషయంలోనూ వీరూ ప్రస్తావించాడు. ప్రస్తుతం భారత అండర్ 19 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్యవీర్ కెరీర్ ఇప్పుడే ప్రారంభ దశలో ఉందని, తాను ఇప్పటికే ఎంతో సాధించానని గుర్తుచేశాడు. ఈ సమయంలో తన కొడుకును తనతో పోల్చడం కూడా సరికాదని అన్నాడు. యువ క్రికెటర్లను ముందుగా స్వేచ్ఛగా ఆడనివ్వాలని, వారు తమను తాము నిరూపించుకునే అవకాశం కల్పించాలని, ఆ తర్వాతే ఎలాంటి పోలికలైనా తీసుకురావాలని సెహ్వాగ్ హితవు పలికాడు.



## మేడ్చల్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

**ప్రజాస్వరం,మేడ్చల్**

మేడ్చల్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని పోచమ్మ దేవాలయం వద్ద లంబోదర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలు 11 రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిమజ్జనం సందర్భంగా చిన్నారులు, మహిళలు, యువకులు ఆటపాటలతో సందడి చేస్తూ ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు.



# ములానీ స్పిన్ మాయ.. కుశాగ్ర సెంచరీ.. ఆసీస్-ఏ పై భారత్-ఏ ఘన విజయం

- **ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్-ఏ 162 పరుగుల తేడాతో ఘన విజయం**
- **మ్యాచ్‌లో మొత్తం ఏడు వికెట్లతో రాణించిన షామ్స్ ములానీ**
- **తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'**
- **కెప్టెన్ దేవదత్ పడిక్కల్ అర్ధశతకంతో రెండో ఇన్నింగ్స్‌లో కీలక పాత్ర**
- **భారత బౌలర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 200 పరుగులకే కుప్పకూలిన ఆస్ట్రేలియా-ఏ**

**ప్రజాస్వరం :**



ఆస్ట్రేలియాఏతో జరిగిన తొలి నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్ఏ జట్టు ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. పుదుచ్చేరి సీఏపీసీషెమ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో 162 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ షామ్స్ ములానీ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టి, మ్యాచ్ మొత్తంలో 124 పరుగులిచ్చి 7 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

363 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా, చివరి రోజైన శుక్రవారం 55/2 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియాఏ, భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది. తొలి గంటలోనే మీడియం పేసర్ అన్షుల్ కంబోజ్, ఓవర్‌నైట్ బ్యాటర్లు నాథన్ మెక్‌స్వీనీ (35), కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (16)లను ఔట్ చేసి ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు.

ఆ తర్వాత పేసర్ తుషార్ దేశ్‌పాండే వరుస బంతుల్లో జోష్ ఫిలిప్, లియామ్ స్కాట్‌లను పెవిలియన్‌కు పంపి పతనాన్ని శాసించాడు. లంచ్ సమయానికి ఆస్ట్రేలియాఏ 185/7 స్కోరుతో కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత షామ్స్ ములానీ మిగిలిన వికెట్లను పడగొట్టాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఫెర్గస్ ఓ'నీల్ (47) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరికి ఆస్ట్రేలియాఏ 55.1 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌట్ అయింది.

అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్ఏ, తమ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (59) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (39)తో కలిసి పడిక్కల్ రెండో వికెట్‌కు 68 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.

అయితే, పడిక్కల్ ఔటైన తర్వాత భారత్ఏ అనూహ్యంగా కుప్పకూలింది. చివరి ఆరు వికెట్లను కేవలం 48 పరుగులకే కోల్పోయి 199 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న కుమార్ కుశాగ్ర (46 నాటౌట్) చివరి వరకు పోరాడాడు.

తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో భారత్ఏ భారీ స్కోరుకు పునాది వేసిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు ఇదే వేదికపై జరగనుంది. ఆ తర్వాత మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్ఏ: 334 & 199

ఆస్ట్రేలియాఏ: 171 & 200 (ఫెర్గస్ ఓ'నీల్ 47; తుషార్ దేశ్‌పాండే 314, షామ్స్ ములానీ 357)

# క్రికెట్‌లో సంచలనం.. ఆఫ్ఘనిస్థాన్‌కు షాకిచ్చిన నేపాల్

- **క్రికెట్‌లో సంచలనం సృష్టించిన నేపాల్ జట్టు**
- **గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు**
- **నేపాల్ స్పిన్నర్ల ధాటికి 102 పరుగులకే కుప్పకూలిన ఆఫ్ఘన్**
- **సుందీప్ జోరా, రోహిత్ పౌడెల్ కీలక ఇన్నింగ్స్‌లతో నేపాల్ ఛేదన**
- **ఈ ఓటమితో ఆఫ్ఘనిస్థాన్ క్వార్టర్ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం**

**ప్రజాస్వరం :**




క్రికెట్‌లో నేపాల్ జట్టు సంచలనం సృష్టించింది. కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన ఆసియా క్రీడల గ్రూప్ఏ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పటిష్ఠమైన ఆఫ్ఘనిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో సమష్టిగా రాణించి ఆఫ్ఘన్ జట్టుకు షాకిచ్చింది. మొదట బౌలర్లు కట్టడి చేయగా, ఆ తర్వాత బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి జట్టును గెలిపించారు.

ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్‌ను నేపాల్ స్పిన్నర్లు కుశాల్ భుర్టెల్, లలిత్ రాజ్‌బంశీ తమ స్పిన్‌తో కట్టిపడేశారు. వీరి ధాటికి ఆఫ్ఘన్ బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. భుర్టెల్ 4 వికెట్లు పడగొట్టగా, రాజ్‌బంశీ కేవలం 13 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీశాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ స్వేచ్ఛగా ఆడలేకపోయింది. ఫైసల్ షినోజాదా (30), నజీబుల్లా జద్రాన్ (30) మాత్రమే కాస్త పోరాడటంతో ఆఫ్ఘన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 102 పరుగులు మాత్రమే చేయగలిగింది.

అనంతరం 103 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు భుర్టెల్ (0), ఆసిఫ్ షేక్ (2) త్వరగా ఔటయ్యారు. కుశాల్ మల్లా కూడా రనౌట్ కావడంతో నేపాల్ 6.3 ఓవర్లలో 31 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సుందీప్ జోరా (34), రోహిత్ పౌడెల్ (33 నాటౌట్) బాధ్యతాయుతమైన భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరూ వికెట్ల పతనాన్ని అడ్డుకొని, స్కోరు బోర్డును నెమ్మదిగా ముందుకు నడిపించారు.

కీలక సమయంలో సుందీప్ జోరా రనౌట్ అయినా, కెప్టెన్ దీపేంద్ర సింగ్ ఐరీ (15)తో కలిసి రోహిత్ పౌడెల్ జట్టును విజయానికి చేరువ చేశాడు. పౌడెల్ 16, 17 ఓవర్లలో మూడు ఫోర్లు కొట్టి ఒత్తిడి తగ్గించాడు. విజయానికి ఒక్క పరుగు దూరంలో దీపేంద్ర ఔటైనా, గుల్షన్ ఝా సింగిల్ తీసి లాంఛనాన్ని పూర్తి చేశాడు.

ఈ విజయంతో నేపాల్ తమ ఖాతా తెరిచింది. గ్రూప్ఏలో ఆఫ్ఘనిస్థాన్ రెండు మ్యాచ్‌లలో ఒకటి గెలిచి, ఒకటి ఓడినా.. మెరుగైన నెట్ రన్ రేట్ కారణంగా టేబుల్‌లో అగ్రస్థానంలో ఉంది. నేపాల్ తన తదుపరి మ్యాచ్‌లో జపాన్‌తో తలపడనుంది. గ్రూప్‌లో టాప్2 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999